ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024



'సీఎం రేసు'పై కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహం

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'సీఎం రేసులో ఉన్నా'నంటూ పలువురు మీడియా ముందు వ్యాఖ్యానిస్తుండడంపై కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు రోజులుగా మంత్రి శరణ బసప్ప దర్శనాపుర, సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి 'నేను ముఖ్యమంత్రి రేసులో ఉన్నా' అంటూ బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే మంత్రి ఎంబీ పాటిల్, ఆర్‌వీ దేశ్‌పాండేతోపాటు పలువురు వ్యాఖ్యానించారు. ఇలా సీఎం రేసులో ఉన్నానంటూ చేస్తున్న వ్యాఖ్యలపై అధిష్టానం తీవ్రంగా స్పందించింది. ఇకపై సీఎం హోదా గురించి మాట్లాడరాదని హెచ్చరించినట్టు తెలుస్తోంది.



పాలకులు లేని పాలికె



- పాలక వర్గం లేకుండానే నాలుగేళ్లు
- 162 ఏళ్ల చరిత్ర కల్గిన బీబీఎంపీలో కొత్తరికార్డు
- ఎన్నికలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం
- వంతపాడుతున్న ఎమ్మెల్యేలు
- స్థానిక సమస్యలు పట్టని పాలకులు
- అన్నింటా అధికారులదే పెత్తనం


బెంగళూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల పరిష్కారానికి పాలకవర్గాలు ఉండాలని, తద్వారా ప్రాంతాల వారిగా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నగర పాలకం... ఏటా గణనీయ అభివృద్ధి చెందుతున్న మహానగరి... ఐటీ బీటీ కార్పొరేట్ కంపెనీలతో ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న విశ్వనగరికి పాలకవర్గం లేక నాలుగేళ్లు ముగిసింది. 162 ఏళ్ల చరిత్ర కల్గిన బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కు నాలుగేళ్ల సుదీర్ఘకాలం కౌన్సిల్ అస్థిత్వంలో లేకుండా కొనసాగడం ఇదే మొదటిసారి. బీబీఎంపీ విభజన, వార్డుల సంఖ్య పెంపు, గ్రేటర్ బెంగళూరు ప్రాధికార వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోంది. వార్డుల విభజన, వార్డుల సంఖ్య పెంపు వంటి రెండు ప్రధాన అంశాలు తెరపైకి వచ్చినప్పుడు ప్రభుత్వాన్ని హైకోర్టు ధర్మాసనం మందలించింది. పాలక వర్గం లేకుండా కొనసాగించడం సరికాదని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని గడువు విధించింది. అయినా ప్రభుత్వం ఏదో ఒక మెలికను అడ్డుపెట్టి ఎన్నికలవైపు వెళ్లకుండా వాయిదా వేస్తోంది. వార్డుల రిజర్వేషన్ అంశంలోనూ ప్రభుత్వం ఇటువంటి ఎదురుదెబ్బలు తినాల్సి వచ్చింది. ఇలా కార్పొరేటర్లు లేకుండా నాలుగేళ్లు గడిచిపోయాయి. 2020 సెప్టెంబరు 10 నాటికి బీబీఎంపీ పాలక వర్గం గడువు ముగిసింది. అప్పట్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీబీఎంపీకి ప్రత్యేకచట్టం రూపొందించాలని ఎన్నికలను వాయిదా వేసింది. నగర పాలక సంస్థలను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో రాజ్యాంగంలో 74వ సవరణ చేశారు. వీటి ప్రకారం మహానగర పాలికెకు నాలుగు ఎన్నికలు జరిగాయి. 2001లో నిర్ణీత గడువులోనే ఎన్నికలు నిర్వహించారు. 2006లో కౌన్సిల్ వ్యవధి ముగిసే సరికి ప్రభుత్వం పాలికెను రద్దు చేసి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించింది. బెంగళూరులో ఏడు నగరసభలు, ఒక పట్టణ పంచాయతీ, 110 పల్లెలను కలిపి 2007లో బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని ఏర్పాటు చేశారు. ఇది ఏర్పడిన వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉండేది. కానీ 2010 మార్చి వరకు ఎన్నికలు జరగలేదు. బీబీఎంపీలో మూడేళ్లపాటు కౌన్సిల్ లేకుండానే పాలన సాగింది. హైకోర్టు ఆదేశాలతో ఎన్నికలు నిర్వహించారు. 2015లో పాలకవర్గం గడువు ముగిసేందుకు మూడు రోజుల ముందే ప్రభుత్వం, బీబీఎంపీని విభజించే కారణంతో కౌన్సిల్‌ను రద్దు చేసి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించింది. దీంతో పలువురు హైకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం జోక్యంతో ఎన్నికలు నిర్వహించారు. ఐదేళ్ల పాలకవర్గం ముగిసేలోగానే నిబంధనల ప్రకారం 2020 సెప్టెంబరు 10లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండేది. నాలుగేళ్లు ముగిసినా ఎన్నికల ప్రస్తావనే లేదు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పాలికె ఎన్నికలను వాయిదా లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఎన్నో కారణాలు...

ఎన్నికల వాయిదాకు ఎన్నో కారణాలు ఉన్నాయి. బీబీఎంపీ విభజన, వార్డుల సంఖ్య పెంపు, గ్రేటర్ బెంగళూరు అథారిటీ వంటి అంశాలను ముందుంచుకుని ఎన్నికలను జాప్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఎన్నికల జాప్యాన్ని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం బీబీఎంపీ ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి వార్డుల సంఖ్యను 198 నుంచి 243కు పెంచుతూ గెజిట్ జారీ చేసింది. ఎన్నికలు నిర్వహించాలని ఆలోచించలేదు. ఆ తర్వాత 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన చేయలేదు. వార్డుల సంఖ్యను 243 నుంచి 225కు తగ్గించింది. బీబీఎంపీ పాలనా సంస్కరణలకు సంబంధించి బీఎస్ పాటిల్ నేతృత్వంలో కమిటీని ఇటీవల మళ్లీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇటీవలే నివేదిక సమర్పించింది. 1నుంచి 10 పాలికెలుగా విభజించాలని, గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఏర్పాటుకు సిఫారసు చేసింది. ఇందుకు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార బిల్లుకు శాసనసభలో అంగీకారం లభించలేదు.

ఎన్నికలంటే అందరూ దూరమే..

బీబీఎంపీ ఎన్నికలు నిర్వహించడం పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు ఎవరికీ ఇష్టం లేదు. ఎన్నికల జాప్యానికి ఎమ్మెల్యేలే ప్రధాన కారణమనే ఆరోపణలు ఉన్నాయి. పాలికెకు ఎన్నికలు జరిగితే కార్పొరేటర్లు ఉంటారు. అభివృద్ధి పనులతోపాటు ఇతరత్రా వారి పర్యవేక్షణలోనే సాగుతాయి. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో కనీసం ఐదారుగురు కార్పొరేటర్లు ఉంటారు. ఎన్నికలు లేకపోతే వార్డుల్లో అభివృద్ధి పనులు ఎమ్మెల్యేలే పర్యవేక్షించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనుల భాగస్వామ్యంలోనూ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల మధ్య వివాదాలు కొనసాగిన సందర్భాలు ఉన్నాయి. కార్పొరేటర్లు లేకపోతే అంతా తామై వ్యవహరించవచ్చునని ఎమ్మెల్యేల అభిప్రాయంగా ఉన్నట్టు తెలుస్తోంది. నగర పరిధిలో రోడ్లు, వరద, చెత్త, తాగునీరు వంటి సమస్యలపై కార్పొరేటర్లు వెంటనే స్పందించేవారు. ప్రజలు, అధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. నగరంలోని ఎమ్మెల్యేలలో జమీర్ అహ్మద్, కృష్ణబైరేగౌడ, దినేశ్‌గుండూరావు, రామలింగారెడ్డి, భైరతి సురేశ్, కేజే జార్జ్ మంత్రులుగా ఉన్నారు. వీరి వద్దకు వెళ్లి సమస్యలు చెప్పే పరిస్థితి ఉండదు. వీరికి అదనంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పదవులు ఉండడంతో వారు స్థానికంగా అందుబాటులో ఉండడం అంతంతమాత్రంగానే ఉంటుంది. ఇక బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి వద్దకు సమస్యలు తీసుకెళ్లడమంటే మరింత జఠిలం. కేపీసీసీ అధ్యక్షుడిగా, ఉపముఖ్యమంత్రిగా, జలవనరులశాఖ మంత్రిగానే కాకుండా బెంగళూరు నగరాభివృద్ధి మంత్రిగాను డీకే శివకుమార్ వ్యవహరిస్తున్నారు. ఆయన వద్దకు వెళ్లి సమస్యలు వివరించాలంటే సాధ్యం కాని పరిస్థితి అని ప్రజలు మిన్నకుండిపోతున్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి పాలకవర్గమే కీలకం. ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడం లేదు.



అసమర్థ హోంమంత్రిని తొలగించాలి

- అన్నింటా వైఫల్యం
- మాజీ ఐపీఎస్ భాస్కర్‌రావు ఆగ్రహం

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హోంశాఖ మంత్రి పరమేశ్వర్ అసమర్థుడని మాజీ ఐపీఎస్ అధికారి భాస్కర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో అతిపెద్ద బాంబు బ్లాస్ట్ కుట్ర జరిగిందన్నారు. ఇదంతా హోంమంత్రిత్వశాఖ వైఫల్యమని అన్నారు. రాష్ట్ర పోలీసుశాఖకు రక్షణ కల్పించే విషయంలో హోం మంత్రి విఫలం చెందారని తెలిపారు. పోలీసుశాఖలో ఏటా 1500 నుంచి రెండు వేల మందికిపైగా రిటైరవుతున్నారని, వారి స్థానంలో కొత్తవారిని భర్తీ చేయలేదని అన్నారు. ఉన్న వారికి పనిభారం పెరుగుతోందన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి నిర్భయ పథకం కింద రాష్ట్రానికి గ్రాంట్లు వచ్చినా సక్రమంగా ఖర్చు చేయలేదని ఆరోపించారు. బీజేపీ కార్యాలయంపై బాంబులు వేసేందుకు కుట్రలు జరుగుతున్నాయంటే నేరస్థులు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చన్నారు. హోం మంత్రి అసమర్థుడని వెంటనే కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



భాస్కర్‌రావు

చాముండేశ్వరి దర్శనానికి స్మార్ట్‌కార్డ్

- క్యూలైన్లలో రద్దీ తగ్గించే యత్నం
- స్మార్ట్ ద్వారా దర్శనం, పూజ, ప్రసాదం పంపిణీ
- నాలుగు విధాలుగా చార్జీలు

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, రాచనగరి మైసూరుకు అనుబంధమైన నాడదేవత చాముండేశ్వరి దర్శనం కోసం సరికొత్త సాంకేతిక విధానం తీసుకొచ్చేందుకు చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార సిద్ధమైంది. క్యూలైన్లలో రద్దీ తగ్గించడంతోపాటు దర్శనం, పూజ, ప్రసాదభాగ్యను కల్పించేందుకు స్మార్ట్‌కార్డును ప్రవేశపెడుతున్నారు. చాముండేశ్వరి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వీరితోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల వాసులు మైసూరు, కొడగులో విహార యాత్రతోపాటు రాజరిక వ్యవస్థ, ప్యాలెస్‌ను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు చాముండేశ్వరిని దర్శించుకుంటారు. శక్తి గ్యారెంటీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి చెందిన మహిళలైనా ఉచితంగా బస్సు ప్రయాణం చేసే వెసులుబాటు ఉండడంతో నిత్యం రద్దీగా సాగుతోంది. ఇటీవల ఆషాఢమాసంలో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఆలయ కమిటీ కి సవాలుగా మారింది. మరికొన్ని రోజుల్లోనే ప్రతిష్టాత్మకమైన మైసూరు దసరా ఉత్సవాలు ప్రారంభమవుతుండడంతో మరోసారి రద్దీ పెరిగే అవకాశం ఉంది. మైసూరు చాముండేశ్వరిని దర్శించుకునేందుకు స్మార్ట్‌కార్డును అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. తద్వారా దేవి దర్శనంతోపాటు పూజ, లడ్డూ ప్రసాదం పొందే వెసులుబాటు ఉంటుంది.



నమ్మ మెట్రో తరహాలో స్మార్ట్‌కార్డు

మెట్రో రైళ్ల ప్రయాణంలో ఉపయోగించే స్మార్ట్‌కార్డు తరహాలోనే చాముండేశ్వరి దేవి దర్శనానికి వచ్చే భక్తులకు స్మార్ట్‌కార్డును ప్రవేశపెడతారు. క్యూఆర్ కోడ్ ఉపయోగించి స్మార్ట్‌కార్డును పొందవచ్చు. ఏడాదిలో ఎన్నిసార్లు దర్శనం చేసుకోవచ్చు అనేది పొందుపరుస్తారు. అందుకు అనుగుణంగా భక్తులు వారికి అనుకూలం ఉన్నప్పుడు చాముండి కొండలకు చేరుకుని రద్దీ సమస్య లేకుండా అమ్మవారిని దర్శనం చేసుకోవచ్చు.



నాలుగు రకాల స్మార్ట్‌కార్డులు

స్మార్ట్‌కార్డుకు ప్రాధికార నాలుగు విధాలుగా చార్జీలు నిర్ణయించింది. రూ.12వేల కార్డు పొందితే ఏడాదికి 12 సార్లు ఒకరు నేరుగా దర్శనంతోపాటు ఒక లడ్డూ ప్రసాదం పొందవచ్చు. రూ.25వేల విలువైన స్మార్ట్‌కార్డు పొందితే ఇద్దరు ఏడాదిలో 12సార్లు దర్శనం చేసుకోవచ్చు. వారికి రెండు లడ్డూలు ప్రసాదంగా ఇస్తారు. రూ.50వేల విలువైన స్మార్ట్‌కార్డు పొందితే ఐదుగురికి నేరుగా దర్శనంతోపాటు చెరో 5 లడ్డూలు, అభిషేకం, పంచామృత ప్రసాదం ఇస్తారు. రూ.లక్ష స్మార్ట్‌కార్డు పొందితే 10 మందికి దర్శనం అవకాశం ఉంటుంది. వారి పేరిట ప్రత్యేక పూజలతోపాటు పంచామృత ప్రసాదం, చెరో పది లడ్డూలు ఇస్తారు. ఆలయం వద్ద ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసి క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించడం ద్వారా స్మార్ట్‌కార్డు పొందే సౌలభ్యం కల్పిస్తారు. డిజిటల్ భద్రత, సాంకేతిక రక్షణ కల్పిస్తారు. స్మార్ట్‌కార్డు స్కాన్ చేస్తే నేరుగా దర్శనంతోపాటు ప్రసాదం పొందే వెసులుబాటు ఉంటుంది. తద్వారా క్యూలో వేచి ఉండే సమస్య ఉండదు. దర్శన వ్యవస్థలోనూ పారదర్శకత ఉంటుంది. ప్రాధికారకు ఆదాయం పెరుగుతుంది. రాజకీయ సిఫారసులకు బ్రేక్ పడుతుంది. వీటన్నింటితోపాటు క్యాష్‌లెస్ లావాదేవీలకు ప్రాధాన్యత అవకాశం ఉంటుంది. భక్తులకు అనుకూలంతోపాటు పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్మార్ట్‌కార్డు విధానం తీసుకురాదలిచామని, ఒకటి రెండు సమావేశాల్లో చర్చించి స్మార్ట్ కార్డులపై పూర్తి వివరాలు ప్రకటిస్తామని చాముండేశ్వరి క్షేత్ర అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి ఎంజే రూప తెలిపారు.

డాక్టర్‌పై చెప్పు విసిరిన మహిళ

- ఓపీడీ రద్దు చేసి వైద్యుల నిరసన

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు ఆసుపత్రిలో డాక్టర్‌పై ఆగ్రహంతో ఓ మహిళ సోమవారం చెప్పు విసిరింది. ఆమెతో పాటు వచ్చిన మరికొందరు డాక్టర్‌పై దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై మంగళవారం చిక్కమగళూరు జిల్లా ఆసుపత్రిలో వైద్యులు ఓపీడీ బంద్ చేసి నిరసన తెలిపారు. చిక్కమగళూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి ఇర్షాద్ అనే వ్యక్తి గొడవలో గాయపడి చికిత్స కోసం వచ్చాడు. అత్యవసర విభాగంలో ఆర్థో డాక్టర్ వెంకటేశ్ చికిత్సలు అందిస్తుండగానే గుంపుగా వచ్చిన వారు గొడవకు దిగారు. అంతలోనే తస్లీమా అనే మహిళ చెప్పు విసిరి, డాక్టర్ కాలర్ పట్టుకుని దాడి చేసింది. ఈ మేరకు డాక్టర్లు ఓపీడీ సేవలను నిలిపివేసి ఆందోళన చేశారు. చిక్కమగళూరు సంఘటనపై బీజేపీ నేత సీటీ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంశాఖ మంత్రి పరమేశ్వర్ స్పందించాలని, డాక్టర్‌పై దౌర్జన్యానికి పాల్పడినవారిని వెంటనే అరెస్టు చేయాలని 'ఎక్స్' ద్వారా డిమాండ్ చేశారు. ఇటీవలే వైద్య చట్టాల్లో మార్పులు తెచ్చారని అయినా డాక్టర్లపై దాడులు బాధాకరమన్నారు.



చెప్పు విసురుతున్న మహిళ



క్రస్ట్ గేట్లను మార్చాల్సిందే..!

- డ్యాం భద్రతకు ఇదే పరిష్కారం
- 1,632 అడుగుల వరకే నీటిని నిల్వ చేయాలి
- స్టాప్‌లాగ్స్ ఏర్పాటుపై అధ్యయనం అవసరం
- 22వ గేటు వద్ద గుంత వల్ల డ్యాంకు ప్రమాదం
- తుంగభద్రపై నిపుణుల కమిటీ ప్రాథమిక అంచనా
- మూడు రోజుల్లో బోర్డుకు నివేదిక


కర్నూలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయడం మంచిది కాదు. మరో క్రస్ట్‌గేటు కొట్టుకుపోదని గ్యారెంటీ ఇవ్వలేం. కొత్తగా, అత్యాధునిక డిజైన్‌తో 33 క్రస్ట్‌గేట్లను ఏర్పాటు చేయడం ఉత్తమం' అని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్ రెడ్డికి కమిటీ మంగళవారం ప్రాథమిక నివేదిక అందజేసింది. డ్యాం గేట్ల అధ్యయనంలో గుర్తించిన అంశాలతో సమగ్ర నివేదిక మూడు రోజుల్లో అందజేస్తామని కమిటీ చైర్మన్ ఏకే బజాజ్ బోర్డు అధికారులకు చెప్పినట్లు సమాచారం. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో పాటుగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం. స్వాతంత్ర్యం రాకముందే 1945లో అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చేపట్టిన ఈ ప్రాజెక్టు 1953లో పూర్తయింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రాజెక్టుగా 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా మారింది. తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. మూడు రాష్ట్రాలకు 70 ఏళ్లుగా సాగు, తాగునీరు అందిస్తోంది. డ్యాం ప్రారంభం నుంచి క్రస్ట్‌గేట్లు సమస్య తలెత్తలేదు. తొలిసారిగా ఈ ఏడాది ఆగస్టు 10న ఎత్తిన గేట్లు దించుతుండగా 19వ నంబరు గేటు చైన్‌లింక్ తెగిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తక్షణమే ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు అప్రమత్తం కావడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌లను దిగ్విజయంగా అమర్చారు. వరద నీరు కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. ఇదే సమయంలో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. టీబీపీ బోర్డు సూచన మేరకు ఎన్‌డీఎస్‌ఏ నియమించిన కమిటీ డ్యాంను పరిశీలించింది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ చైర్మన్‌గా, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఢిల్లీకి చెందిన హర్కేశ్‌కుమార్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ రాష్ట్రం సీడీవో ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డు ఎస్‌ఈ సుధాకర్, కర్ణాటక రాష్ట్రం టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రిటైర్డు సెక్రటరీ సిద్దరంగప్ప సభ్యులుగా ఉన్న నిపుణుల కమిటీ సోమ, మంగళవారం రెండు రోజులు డ్యాంతో పాటు క్రస్ట్‌గేట్లను తనిఖీ చేసింది.

కీలక అంశాలతో నివేదిక

తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్‌గేట్లు జీవితకాలం తీరడంతో వాటి స్థానంలో అత్యాధునిక డిజైన్‌తో కొత్తగేట్లు ఏర్పాటు చేయాలని ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ప్రధానంగా అభిప్రాయపడింది. గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటు గురించి నిపుణులతో అధ్యయనం చేయించాలి. మూడు రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు సంరక్షించే భారీ ప్రాజెక్టు కావడంతో జలాశయం పటిష్ఠతపై (డ్యాం హెల్త్ కండిషన్) పూర్తిస్థాయిలో సంబంధిత నిపుణులతో అధ్యయనం చేయించాలి. క్రస్ట్‌గేట్ల దిగువ భాగం దాదాపు 9 నెలలకు పైగానే నీటిలో ఉంటున్నందున.. వాటి అరుగుదలను కూడా పరిశీలించాల్సి ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. గతంలో 1,632 అడుగుల లెవల్‌లో నీటిని నిల్వ చేసేవారు. ఆ తరువాత గరిష్ఠ లెవల్ 1,633 అడుగుల వరకు నీటి నిల్వ చేయడం వల్ల గేట్లపై ఒత్తిడి పెరిగింది. కాబట్టి.. ఇకపై 1,632 అడుగుల లెవల్‌లోనే నీటిని నిల్వ చేయాలని కమిటీ సూచించింది. గేట్లు కనీసం 2.5 అడుగులు ఎత్తాలని, ఒక అడుగు, అర అడుగు ఎత్తడం వల్ల నీటి ప్రవాహ వేగం, ఒత్తిడికి గేట్ల దిగువన డ్యాం బయటి వైపు గుంతలు పడి డ్యాం పునాదులకే ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఇక నుంచి గేట్లు ఎత్తాల్సి వస్తే.. కనీసం 2.5 అడుగులు ఎత్తాలని సూచించారు. అలాగే ఈ డ్యాంకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ లేవు. దీంతో సాంకేతిక సమస్యలతో ఏదైనా గేటు కొట్టుకుపోతే క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల వరకు డ్యాం ఖాళీ చేయాల్సి వస్తుంది. ఈ సమస్య తలెత్తకుండా థర్డ్‌పార్టీ నిపుణులతో స్టాప్‌లాగ్ ఏర్పాటుపై అధ్యయనం చేయించి, వారు ఇచ్చే నివేదిక మేరకు ముందుకు వెళ్లాలి. ఇలా పలు సూచనలతో ఏకే బజాజ్ నాయకత్వంలోని నిపుణుల కమిటీ టీబీపీ బోర్డు అధికారులకు ప్రాథమిక నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

ఆ గుంత వల్ల డ్యాంకు ప్రమాదం

శ్రీశైలం ప్రాజెక్టుకు ప్లంజ్‌పూల్ వల్ల ఎలాంటి ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారో.. అదే తరహాలో తుంగభద్ర డ్యాంకు కూడా ఓ భారీ గుంత(పూల్) వల్ల ప్రమాదం పొంచి ఉందని నిపుణులు గుర్తించారు. డ్యాం బయట వైపున 22వ నంబరు గేటు దిగువన 40 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. దీని వల్ల డ్యాం పునాదులకు ప్రమాదం పొంచి ఉందని గతంలోనే నిపుణులు పలుమార్లు హెచ్చరించారు. డ్యాం లెఫ్ట్ బ్యాంక్ (మునిరాబాద్ వైపు) ఆనకట్టకు 100 మీటర్ల దూరంలో పార్కులో బోటింగ్ కోసం సరస్సు ఏర్పాటు చేశారు. ఈ సరస్సులోకి నీరు మళ్లించేందుకు లెఫ్ట్ కెనాల్‌కు తూములు కూడా ఏర్పాటు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. అయితే ఈ సరస్సులోకి డ్యాం నుంచి లీకేజీ అవుతోందని, దీని వల్ల కూడా ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ రెండింటి పూడ్చివేత కోసం బోర్డు ఇంజనీర్లు డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్) కింద కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు కాలేదు. ఈ గుంతల వల్ల డ్యాంకు ప్రమాదం ఉన్నమాట నిజమే అయినా తాము ప్రస్తుతం క్రస్ట్‌గేట్లు, హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీపైనే అధ్యయనం చేసి నివేదిక ఇస్తామని నిపుణుల కమిటీ చెప్పినట్లు తెలిసింది.



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు



మర్చడ్ గ్రామం వద్ద పొలాల్లో చేరిన వర్షపు నీరు

భారీ వర్షాలతో నీట మునిగిన పొలాలు

రాయచూరు, సెప్టెంబరు 10 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని రైతులు అతలాకుతలమయ్యారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితి తలెత్తడంతో పంటనష్టంతో రైతులకు కోలుకోని దెబ్బ పడింది. ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాలు శాపంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా అనేక తాలూకాల్లోని రైతులు తమ పంటలు పూర్తిగా నీట మునిగాయని ఆవేదన చెందుతున్నారు. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో తేమ శాతం అధికమై పంటలు తెగుళ్లబారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కురిసిన వర్షాల వల్ల పలు గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వడంతో పాటు అస్తవ్యస్తంగా మారుతున్న కాలనీలు, వార్డుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

గురుగుంట వద్ద దెబ్బతిన్న పంట





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.86	1,622.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	28,726	1405
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	34,756	9,997
సామర్థ్యం (టీఎంసీలు)	101.23	69.81

ఆశా కార్యకర్తల డిమాండ్లను సాధిస్తాం

13, 14 తేదీల్లో కార్యకర్తల రాష్ట్ర సమ్మేళనం



మాట్లాడుతున్న రాష్ట్రకార్యదర్శి నాగలక్ష్మి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 10: తమ కార్యకర్తల డిమాండ్ల సాధనే ధ్యేయమని ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్రకార్యదర్శి నాగలక్ష్మి తెలిపారు. వారిని సంఘటిత పరిచేందుకు ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్రస్థాయి ప్రథమ సమ్మేళనం ఈనెల 13, 14 తేదీల్లో కలబుర్గిలో జరుపుతున్నట్లు ఆమె వెల్లడించారు. నగరంలో మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల నుంచి ఆశా ప్రతినిధులు ఇందులో పాల్గొంటారన్నారు. బహిరంగ సభకు 6వేల మందికిపైగా ఆశాకార్యకర్తలు, హాజరుకానున్నట్లు చెప్పారు. జాతీయ అభియాన్ కింద నియమించిన ఆశా కార్యకర్తలు, ఆరోగ్య రంగంలో అత్యంత కిందిస్థాయి పనులు నిర్వహిస్తున్నారన్నారు. కరోనా సమయంలో ఆశా కార్యకర్తలను ప్రభుత్వాలు కరోనా వారియర్స్‌గా గుర్తించగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ భౌగోళిక ఆరోగ్య నాయకులుగా శ్లాఘించిందన్నారు. ఇంత ప్రశంసల జల్లు కురిసినా వారిజీవితాలు బాగుపడలేదని ఆవేదన వ్యక్తపరిచారు. కలబుర్గిలో జరిగే ఆశాకార్యకర్తల సమ్మేళనంలో తమ హక్కులపై చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఈసందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు శాంత, ఎం.గీత, జిల్లాకార్యదర్శి లక్ష్మీదేవి, యశోధ, రామక్క, రేష్మ, కవిత, ఖైరున్నీస్, రాబియా తదితరులు పాల్గొన్నారు.

13నుంచి ఓరల్ ఆర్థోపెడిక్ సదస్సు

బళ్లారి సిటీ, సెప్టెంబరు10: రాష్ట్రస్థాయి ఆల్ ఇండియా ఓరల్, మాక్సిల్లోఫేషియల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షికసదస్సు ఈనెల 13నుంచి జిందాల్ విద్యానగర్‌లో నిర్వహిస్తున్నట్లు సదస్సు కార్యదర్శి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఐఎంఏ హాలులో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు, యువ ఓరల్, పేషియల్ మాక్సిల్లోపేషియల్ కాన్ఫరెన్స్‌లో వైద్యరంగంలో సరికొత్త ఆవిష్కరణల గురించి తెలియజేస్తారన్నారు. ఈవిషయంలో సెప్టెంబర్ 13న నిష్ణాతులైన వైద్యులు రోజంతా వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. సెప్టెంబర్ 15నచీలిక పెదవి చికిత్స, ముఖాన్ని అందంగా మార్చడం, దవడను తిరిగి జోడించడం వంటి విషయాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. కార్యక్రమాల్లో బళ్లారి ఎంపీ తుకారాం, జిందాల్ విజయనగర్ వర్క్స్ చైర్మన్ మురుగన్, బళ్లారి మెడికల్ క ళాశాల డైరెక్టర్ గంగాధర్‌గౌడ, ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ భారతి, భగవాన్ దాస్‌రాయ్, ఆల్ ఇండియా మౌత్,పేస్ అండ్ పెదవి థెరపీ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి గిరీశ్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు రాందాస్ బాలకృష్ణ, కార్యదర్శి నాగరాజప్ప దాస్ పాల్గొంటారన్నారు.

పాఠశాల తనిఖీ



చలవాది పాఠశాలను పరిశీలిస్తున్న శిక్షణ అధికారి

కంప్లి, సెప్టెంబరు 10: కుడితిని పట్టణం 18వ వార్డు చలవాది నగరంలో శిథిలావస్థకు చేరుకున్న స్కూలు గురించి మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. తాలుకా శిక్షణ అధికారి సిద్దలింగమూర్తి మంగళవారం పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను పరిశీలించామని, అది శిథిలావస్థలో వుందని, త్వరలో పాఠశాలకు కొత్త నిర్మాణాలను చేపట్టి నూతన పాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం పలువురు స్థానికులు మాట్లాడుతూ.. 20 సంవత్సరాల క్రితమే ఈ పాఠశాల భవనం పూర్తిగా ధ్వంసమైందని పిల్లలు చదువుకోవడానికి పొరుగు పాఠశాలలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. వెంటనే నూతన కట్టడాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు సమస్య లేకుండా చూడాలన్నారు. వారితో పాటు హెచ్ఎం రామచంద్రప్ప, దివాకర్, మల్లికార్జున, ఆనంద్, స్థానికులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్రమాదాల నివారణ

● గ్యాస్ లీకేజీ నివారణపై మాక్ డ్రిల్‌లో కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 10: ప్రమాదం జరిగినప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపకదళం, పోలీసు, ఆరోగ్యశాఖల సంయుక్త సహాయ, సహకారాలు అవసరమని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. జిల్లా యంత్రాంగం, ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం బళ్లారి- హొసపేట కొత్త హైవేపై నిర్వహించిన గ్యాస్ లీకేజీ నిర్వహణపై మాక్ డ్రిల్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. హైవేలపై ఎల్‌పీజీ గ్యాస్ నింపిన వాహనాల రవాణా సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. గ్యాస్ లీకేజీ నిర్వహణపై ప్రదర్శనలో పాల్గొన్న వివిధ విభాగాలను పటిష్ఠం చేశామని, ఏదైనా సంఘటన జరిగితే సహాయక చర్యలు చేపట్టేందుకు అన్నిసన్నాహాలు చేశామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ చీఫ్ కమాండెంట్ అఖిలేష్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని భారీ ప్యాక్టరీలలో వివిధ రకాల గ్యాస్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ మాక్‌ప్రదర్శన ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకారం అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ప్రమాద సమయంలో ఎలా వ్యవహరించాలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



ప్రమాదంలో ప్రథమచికిత్స చేస్తున్న వైద్యులు



మాక్‌డ్రిల్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం

కంప్లి, సెప్టెంబరు 10 : కుడితిని పట్టణం వద్ద వుండే కేపీసీఎల్‌లోని బీటీపీఎస్‌లో కార్మికులకు కాంట్రాక్టర్లు కనిష్ఠ వేతనం ఇవ్వకపోతే నిరసన తెలియజేయడానికి సిద్ధమని కార్మిక విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. కుడితిని పట్టణంలోని పల్లెద భవన్‌లో బీటీపీఎస్ కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత కొంతకాలంగా కూలీ కార్మికులకు అన్యాయం జరుగుతోందని, ఆ అన్యాయం ఇకపై జరుగరాదని సూచించారు. కార్మికులకు తాము అండగా వుంటామని సూచించారు. గిట్టుబాటు కూలీలు ఇచ్చేవరకు ఈ పోరాటం చేస్తామన్నారు. అనంతరం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ సురేష్‌తో చర్చించారు. అనంతరం కేసు నమోదు చేయడంతో మంగళవారం తొమ్మిది మందిలో కేవలం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ సురేష్‌బాబు మాత్రమే రాగా వారితో వేతనాల విషయంపై పోలీస్ స్టేషన్‌లో చర్చించారు. అనంతరం కాంట్రాక్టర్ సురేష్ మాట్లాడుతూ కేపీసీఎల్ ఖాయ పరిచిన వేతనాలే తాము చెల్లిస్తున్నామన్నారు. అనంతరం గౌరవాధ్యక్షులు వెంకటరమణ బాబు మాట్లాడుతూ ఇప్పటికి 21 సంవత్సరాలుగా టెండర్లలో కూలీలకు అన్యాయం జరుగుతోందని, ఇది సరికాదన్నారు. అనంతరం ఎస్ఎస్‌పై పనులకు తగిన వేతనాలు ఇవ్వకపోతే ధర్నాలు చేస్తామన్నారు. ఎస్ఐ శాంతమూర్తి మాట్లాడుతూ కేపీసీఎల్ వారితో చర్చించి తొమ్మిది మంది కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలపై చర్చిద్దామన్నారు. అప్పటి వరకు తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ సూచన మేరకు తాము నిరసన చేపట్టడం లేదన్నారు. కార్యక్రమంలో రామలింగప్ప, జటంగి బసవరాజు, ప్రతాప్, ఆనంద్, తిమ్మప్ప, క్రైమ్ ఎస్ఐ విరుపాక్షప్ప తదితరులు పాల్గొన్నారు.



పల్లెద భవన్‌లో మాట్లాడుతున్న కార్మికసంఘం అధ్యక్షుడు రాజశేఖర్

వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలి

● కేంద్ర కార్యక్రమాల ప్రగతిపై ఎంపీ తుకారాం సమీక్ష

హొస్పేట (విజయనగర్), సెప్టెంబరు10 :జిల్లాలో వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అభివృద్ధి సమన్వయ సమితి చైర్మన్, బళ్లారి లోక్‌సభ సభ్యులు తుకారాం అన్నారు. విజయనగరం జిల్లాలోని హొస్పేట, కూడ్లిగి, కొత్తూరు, హువినహడగలి, హగరి బొమ్మనహళ్లి, హరప్పనహళ్లి తాలుకాల్లో నైపుణ్యం కలిగిన వ్యవసాయాధికారుల బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా పాలన భవన్‌లోని ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లాలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయని, నేల నాణ్యత ఆధారంగా పంటలు పండించాలన్నారు. పట్టు, చింత పండు, ద్రాక్ష తదితర అన్ని రకాల పంటలు పండించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఆంబులెన్స్, స్కానింగ్ మిషన్ సహా వైద్య సదుపాయాలు ఏమైనా అవసరమైతే తనకుతెలపాలన్నారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్యను సున్నాకు తగ్గించాలని, జిల్లాలో నరేగా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఎమ్మెల్యే లతా మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని తాలుకాల్లో బాల్య వివాహాలు పెరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కృష్ణానాయక్, జిల్లాధికారి ఎంఎస్ దివాకర్, జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ అలీ అక్రమ్ షా, డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణ, తహసీల్దార్లు, ప్లానింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తుకారాం

విద్యార్థులు మానసికంగా దృఢంగా మారాలి

● ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమని

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 10: దేశాభివృద్ధికి పట్టుకొమ్మలుగా చెప్పుకునే నేటి విద్యార్థులు మానసికంగా దృఢంగా మారాలని, మనసులో ఉన్న భయాలను పోగొట్టుకుని ఉత్తమ జీవనం గడపాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమని పేర్కొన్నారు. జిల్లా న్యాయవాదుల సంఘం, సాంఘీక సంక్షేమ శాఖ, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమాల విభాగం సంయుక్తంగా నగరంలోని హానగల్ కుమారేశ్వర పాలిటెక్నిక్ కళాశాల సభాంగణంలో 'ఆత్మహత్యల గురించి ఉన్న అభిప్రాయాలను మార్చుకోండి' అనే నినాదంతో మంగళవారం సమావేశం ఏర్పాటుచేసింది. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. జీవితం పట్ల విరక్తి, కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యలు, పేదరికం, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకుని తమ అమూల్యమైన జీవనాన్ని పోగొట్టుకుంటున్నారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, సమస్య పరిష్కారం కోసం వెతకాలేగాని, ఆత్మహత్యకు పాల్పడరాదని హితవు పలికారు. ముఖ్యంగా విద్యార్థులు ఫలితాలు వెలుబడిన తరువాత క్షణికావేశానికి పాల్పడి ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదని, పరీక్షల్లో ఫెయిలైనంత మాత్రాన భవిష్యత్ అంధకారం కాదని, ఓటమి అనేది విజయానికి సోపానం లాంటిదని విద్యార్థులు గుర్తించాలన్నారు. దేశంలో ప్రతి సెకెండుకు ఒకరు చొప్పున సంవత్సరానికి 1.80లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించి జీవితం పట్ల విరక్తి చెందిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ఆత్మహత్యలకు ప్రయత్నించిన 47 మందికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో భవిష్యత్‌పై ఆశలు పెంచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మానసకి ఆరోగ్య కార్యక్రమాల అమలు అధికారి, జిల్లా కుష్ఠరోగ నివారణాధికారి డాక్టర్ విరేంద్ర కుమార్ మాట్లాడుతూ మధ్య వయస్సు కలిగిన వారే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా కౌల్ బజార్ పోలీసు స్టేషన్ పోలీసు ఇన్‌స్పెక్టర్ టి.సుభాష్ చంద్ర, జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ పూర్ణిమా కట్టమని, జిల్లా సర్వెలెన్స్ అధికారి డాక్టర్ మరియంబి, హెచ్. దానప్పనవర్, భారతీయ వైద్య సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమని

ఘనంగా వినాయక నిమజ్జనం



వాహనాల్లో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక ప్రతిమలు

సిరుగుప్ప, సెప్టెంబరు 10: పట్టణంలో పలుచోట్ల గణపతి విగ్రహాలను వాహనాల ద్వారా ఊరేగించి నిమజ్జనం చేశారు. వాడవాడలా గణేష్ సంబరాలు జరుపుకుంటున్నారు. సిరుగుప్ప తాలుకాలో ఎక్కడ చూసినా గణేశ ఉత్సవాలు జోరుగా జరిగాయి. ప్రధానంగా తెలుగు ప్రాథమిక పాఠశాల వద్ద రాఘవేంద్ర వినాయకుడిని ప్రతిష్ఠించినచోట అన్నదానం నిర్వహించారు. తాయమ్మ ఆలయం వద్ద ఈశ్వర గణేశుడిని, కమ్మసంఘం భవనం ఆవరణలో భారీఎత్తున వినాయకుడిని ప్రతిష్ఠించారు. దర్శనంకోసం భక్తులు బారులుతీరారు. ఈ యేడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో ఉత్సవాలు భారీగా జరుపుకుంటున్నారు.

ఎస్సీ, ఎస్టీ గ్రాంట్ సక్రమంగా వినియోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయేంద్రబాబు

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 10: షెడ్యూల్డ్ కులాల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు ఇచ్చే ప్రత్యేక గ్రాంట్‌ను అధికారులు సక్రమంగా వినియోగించాలని బెంగళూరు ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్స్ చేంజ్ (ఐఎస్ఈసీ) మాజీ పీడీ విజయేంద్రబాబు అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమంపై ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ పథకాల ప్రభావంపై అధ్యయనంలో భాగంగా ఆయన మంగళవారం నగరంలోని జిల్లాపంచాయతీ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల లబ్ధిదారుల వ్యక్తిగత అభివృద్ధి కోసం మంజూరైన గ్రాంట్లను నిజాయితీగా ఖర్చు చేయాలన్నారు. అధికారులు తమ శాఖల ద్వారా అందజేసే వివిధ సౌకర్యాల గురించి తగిన ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల కింద లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. వారు సౌకర్యాలను వినియోగించుకునేలా చూడాలన్నారు. ఉపయోగించని గ్రాంట్ పునఃపంపిణీ చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉప పథకం కింద అమలు చేసే కార్యక్రమాలను ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించిన అధికారులు క్రమశిక్షణ లేదా క్రిమినల్ చర్యలు తీసుకుంటారని ఆయన అన్నారు. ప్రధానంగా ఎస్సీ ఎస్పీ, టీఎస్పీ పథకాల కింద అందజేసే గ్రాంట్లను వారికి మాత్రమే కేటాయించాలన్నారు. ఈసందర్భంగా బెంగళూరు ఐఎస్ఈసీ అధినేత ప్రొఫెసర్ మదేశ్వరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వాణి, జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి దివాకర్, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరైన సమయంలో టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్లా

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 10: ప్రసవం అనంతరం నవజాత శిశువులకు 12రోగాలకు సంబంధించి రోగనిరోధక శక్తిని పెంచే టీకాలను తల్లితండ్రులు తప్పకుండా వేయించాలని అంటురోగాల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బళ్ళారి విభాగం ఆధ్వర్యంలో నగరంలోని అల్లం గోకులం సభాంగణంలో వైద్యాధికారులు, క్షేత్ర సిబ్బందికి ఏర్పాటు చేసిన జాగృతి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిన్నారులకు బాల్యంలో పోలియో చుక్కలు, బాలక్షయకు బిసిజి టీకా, కామెర్ల వ్యాధికి హెపాటైటిస్ ఇంజక్షన్, కుక్కదగ్గు, ధనుర్వాత, రోటావైరస్, హెచ్.ఎన్ ఫ్లూయెంజా, కామెర్లు, పెంటావైలెంట్ టీకాలాంటివి వేయించాలన్నారు. విశ్వ ఆరోగ్య సంస్థ సర్వేక్షణాధికారి డాక్టర్ ఆర్.ఎస్. శ్రీధర్ మాట్లాడుతూ, పోలియో, కుక్కదగ్గు, ధనుర్వాతం, రొబెల్లా, మెదడు వాపు జ్వరానికి 16 నుండి 23 నెలలోపు వరకు బూస్టర్ డోస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అంటురోగాల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్ అబ్దుల్లా కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు.

వినాయక మండపంలో ప్రత్యేక పూజలు

కంప్లి, సెప్టెంబరు 10: కుడితిని పట్టణంలో శ్రీ రాఘవేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు జరిగినట్లు అధ్యక్షులు వీరేంద్ర ప్రసాద్ తెలిపారు. గత రెండు రోజులుగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ప్రతి యేటా వినాయక చవితి పండుగను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా జోగద మంజమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో పట్టణాల్లో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు చేయడం వల్ల గ్రామాలు, పట్టణాలు బాగుంటాయన్నారు. కుడితిని పట్టణంలో వినాయక చవితి వేడుకలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారితో పాటు పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ, ఉపాధ్యక్షులు కణికేరి పంపాపతి, వీరేంద్రప్రసాద్, రాము, రాజశేఖర, వెంకటరమణబాబు, రావ ు లిం గ ప్ప, యల్లప్ప, ఎస్ఐ శాంతమూర్తి, విరుపాక్షి, రాఘవేంద్ర, పదాధికారి రాము, సురేష్, నాగరాజు, యల్లారెడ్డి, తదితర సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగద మంజమ్మ

హొసూరు జోన్

రాంబుటాన్ పండ్లపై నగరవాసుల ఆసక్తి



హొసూరు, సెప్టెంబరు 10: హొసూరు ప్రాంతంలో రాంబుటాన్ పండ్లపై నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ముళ్లపండుగా ప్రసిద్ధికెక్కిన ఈ పండ్లను తిరువనంతపురం, కన్యాకుమారి, కేరళ, కృష్ణగిరి జిల్లాలో పండిస్తున్నారు. వీటిని హొసూరులో కిలో రూ.400 వంతున విక్రయిస్తున్నారు. అధిక ధర అయినప్పటికీ ప్రజలు ఎంతో ఆసక్తిగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. కేరళ ప్రాంత ప్రజలు ఈ పండ్లను ఎక్కువగా ఇష్టపడతారు. వీటి లోపల ఉండే గింజ, దానిచుట్టూ ఉండే గుజ్జు ఎంతో రుచుగా ఉంటుందని చెబుతున్నారు. ఎన్నో రోగాలను నయం చేసే గుణం ఇందులో ఉందని, అందుకే కేరళ ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. హొసూరురైతులు కూడా ఈ పండ్లను పండించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అన్ని వార్డుల్లో వైభవంగా వినాయక పూజలు

హొసూరు, సెప్టెంబరు 10: హొసూరు నగరమంతటా గణేశ చతుర్థి సందర్భంగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు జరుపుకుంటున్నారు. హొసూరు మున్సిపల్ కార్పొరేషన్ 7వవార్డులోని మునిదేవినగర్, జేజేనగర్‌ల్లో సెల్వగణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ వెస్ట్ రీజియన్ కార్యదర్శి ఆనందయ్య, ప్రత్యేక అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, టాక్స్ కమిటీ చైర్మెన్ చెన్నీరప్ప, హొసూరు 8 వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, డీఎంకే అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు చర్యలు చేపట్టాలి

హొసూరు, సెప్టెంబరు 10: హొసూరు నగర పరిధిలో దోమల ఉత్పత్తి పెరిగి, డెంగీ విజృంభిస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు లేకపోవడంతో డెంగీ పీడితులు ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ వైద్యాధికారి తెలిపిన వివరాల ప్రకారం హొసూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే డెంగ్యూ రోగులకు ఉదయం రక్త నమూనా తీసుకుంటే సాయంత్రం లేదా మరుసటి రోజు ఉదయం ఫలితాలు అందుబాటులోకి వస్తున్నాయి. అప్పటి వరకు రోగులకు వైద్యం అందడంలేదు. దీంతో డెంగీ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వాసుపత్రికి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. డెంగీ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించేందుకు అదనపు వైద్యులు, నర్సులను నియమించాలని, కార్పొరేషన్ పరిధిలో డెంగీ నివారణకు చర్యలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో నిలవేంబు కషాయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

నత్తనడకన ఫ్లై ఓవర్ పనులు

హొసూరు, సెప్టెంబరు 10: హొసూరు మునిసిపాలిటీ జూజూవాడి సిప్‌కాట్ పరిధిలోని నేషనల్ హైవేపై ఫ్లైఓవర్ పనులు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. తద్వారా సామాన్య ప్రజలు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. హొసూరు బెంగళూరు జాతీయ రహదారి కావడంతో ఈ రోడ్డులో లక్షల సంఖ్యల్లో వాహనాలు రాకపోకలు జరుపుతుంటాయి. ఫ్లైఓవర్ పనుల కారణంగా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది. ఫ్లైఓవర్ పనుల జాప్యానికి గ ల కారణాలను జిల్లా అధికారులు సమీక్షించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణం జరుగుతున్న హొసూరు సిప్‌కాట్ ఫ్లైఓవర్

ఆస్పత్రుల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కార్యదర్శి సుభోద్ యాదవ్

రాయచూరు, సెప్టెంబరు 10: జిల్లాలోని మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిలో స్వచ్ఛతకు తొలి ప్రాధాన్యతనివ్వాలని కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి సుభోద్ యాదవ్ అన్నారు. కేంద్ర కార్యదర్శి మంగళవారం నగరంలోని 60 పడకల మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసవం జరిగిన మహిళలు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడిన కార్యదర్శి ఆస్పత్రిలో వారికి అందుతున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన వెంట ఉన్న అధికారులను ఆస్పత్రిలో స్వచ్ఛతతో పాటు దోమలు కుట్టకుండా తెరలు ఏర్పాటు చేయాలన్నారు. రోగులు, వారి అటెండెంట్‌లకు సురక్షితమైన తాగునీరు అందించాలని ఆస్పత్రి పరిసరాలను మరింత పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచే హైదరాబాద్‌లోని పౌష్టికాహార తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లాధికారి నితీశ్, వైద్య శాఖ అధికారులు తదితరులున్నారు.

మానవహారం ఏర్పాటుపై నేడు సన్నాహక సమావేశం

రాయచూరు సెప్టెంబరు 10 : ఈనెల 15న నిర్వహించే అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ నిర్వహణకు సంబంధించి బుధవారం జిల్లాధికారి కార్యాలయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశామని అడిషనల్ జిల్లాధికారి శివానంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ప్రజాప్రభుత్వ దినోత్సవంలో భాగంగా ఈ నెల 15వ తేదీన జిల్లాలోని గూగల్ బ్రిడ్జి నుంచి రోడలబండా వరకు మానవహారం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వివిద శాఖల ఆధ్వర్యంలో తీసుకోవల్సిన చర్యలపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో రాష్ట్రవ్యాప్తంగా బీదర్ నుంచి చామరాజ నగర్ వరకు మానవహారం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో జిల్లాలోను ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రజాసంఘాలు ఇతర సంఘాల నాయకులు తోడ్పాటునందించాలని కోరారు.

రేపు ఆత్మహత్యల నివారణ దినోత్సవం

ఈ నెల 12వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామని మానసిక ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 12వ తేదీన జిల్లా పంచాయతీ, జిల్లా పట్టణ విభాగం, న్యాయసేవా ప్రాధికార, విద్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జాగృతి జాతా నిర్వహిస్తామన్నారు. జాతా ప్రధాన రహదారుల్లో సాగుతుందని కనుక అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఓ హెన్రీ (జయంతి)



కలంపేరు 'ఓ హెన్రీ'తో పేరొందిన విలియం సిడ్నీ పోర్టర్ 1862 సెప్టెంబరు 11న అమెరికా దేశం నార్త్ కరోలినా ప్రాంతంలో జన్మించారు. ఆయన కథలు ఆకట్టుకునేలా ఉండే చిత్రవిచిత్రంగా ఆసక్తిగా ముగిసేవి. కవితారంగంలోనూ, నవలా రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. 381 చిన్నకథలు రాశారు. తన 47వ యేట 1910 జూన్ 5న కన్ను మూశారు. ఆయన గౌరవార్థం చిన్నకథల రంగంలో రాణిస్తున్న వారికి 'ఓ హెన్రీ అవార్డు' ఏటా ఇస్తున్నారు.

వినోబా భావే (జయంతి)



ప్రముఖ గాంధేయవాది ఆచార్య వినోబాభావే 1895 సెప్టెంబరు 11న మహారాష్ట్రలోని గగోదే ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు వినాయక్ నరహరి భావే. స్వాతంత్ర్య సమరయోధుడు. భూదాన ఉద్యమంలో దేశవ్యాప్తంగా పాదయాత్రలో చురుగ్గా పాల్గొని ప్రజలను చైతన్యం చేశారు. మహాత్మాగాంధీకి ఆధ్యాత్మిక వారసుడిగా గుర్తింపు పొందారు. భగ వద్గీతను మరాఠీ భాషలోకి అనువదించారు. రామన్ మెగసెసే పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి. 1982 నవంబరు 15న కన్నుమూశారు. 1983లో మరణానంతర 'భారతరత్న' ప్రకటించారు.

లాలా అమరనాథ్ (జయంతి)



భారత క్రికెట్ పితామహగా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత లాలా అమరనాథ్ భరద్వాజ్ 1911 సెప్టెంబరు 11న పంజాబ్ రాష్ట్రం కపుర్తలాలో జన్మించారు. గొప్ప క్రికెటర్, దేశ టెస్ట్ క్రికెట్‌లో నేషనల్ క్రికెట్ టీమ్ నుంచి తొలి సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు. 1952లో తొలి టెస్ట్ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించి పాకిస్థాన్ జట్టుపై విజయం సాధించారు. ఆయన కుమారులు సురిందర్, మొహిందర్ అమరనాథ్ కూడా టెస్ట్‌ప్లేయర్లు. మన వడు దిగ్విజ్ ఫస్ట్‌క్లాస్ ప్లేయర్‌గా రాణిస్తున్నారు. 1994 లో సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. 2000 ఆగస్టు 5న కన్నుమూశారు.

బుజ్జాయి (జయంతి)



'బుజ్జాయి'గా పేరొందిన దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి 1931 సెప్టెంబరు 11న తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. 'పద్మ భూషణ్' పురస్కార గ్రహీత. తొలి పిల్లల కార్టూన్ పుస్తకాలతో 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ కామిక్స్'గా గుర్తింపు పొందారు. పంచతంత్ర కథలు, బొమ్మలతో జానపదం, చారిత్రాత్మకం సహా పలు రకాల సందేశాలతో ఆయన కథలు ఉండేవి. 'డుంబు'ను కార్టూన్ ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయన కథలు, బొమ్మలు, రచనలు ఆంగ్లం సహా వివిధ భాషలలో పత్రికలలో దేశ వ్యాప్తంగా ఆరు దశాబ్దాలపాటు ప్రచురితమయ్యాయి. 2022 జనవరి 28న కన్నుమూశారు.

కారైకుడి మణి (జయంతి)



మృదంగ విద్వాంసుడిగా పేరొందిన గురు కారైకుడి మణి 1945 సెప్టెంబరు 11న తమిళనాడు రాష్ట్రం కారైకుడి ప్రాంతంలో జన్మించారు. చిన్నతనం నుంచే కర్ణాటక సంగీతంపై ఆసక్తి పెంచుకున్నారు. మృదంగ వాదనలో పట్టు ఆకర్షితులై గాత్ర సంగీతానికి స్వస్తి పలికారు. శృతిలయ సేవా స్కూల్ పేరిట కేంద్రాలు ఏర్పాటు చేసి చెన్నై, బెంగళూరు సహా దేశ విదేశాల్లో శిక్షణ ఇస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ కళా కారులతో కచేరీలు నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2023 మే 4న కన్నుమూశారు.

సుబ్రహ్మణ్య భారతి (వర్ధంతి)



భారతీయార్‌గా పేరొందిన సుబ్రహ్మణ్య భారతి 1882 డిసెంబరు 11న తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా ఎట్టాయపురం ప్రాంతంలో జన్మించారు. 11వ యేటకే 'భారతి' బిరుదు పొందారు. తమిళ కవి, రచయిత, పాత్రికేయుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త. ఆధునిక తమిళ సాహిత్యంలో 'మహాకవి భారతి'గా పేరొందారు. తమిళం, సంస్కృతం, హిందీ సహా 29 భారతీయ, మూడు విదేశీ భాషలలో రాణించారు. 38వ యేట 1921 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

మద్దూరి అన్నపూర్ణయ్య (వర్ధంతి)



ఆంధ్రా నేతాజీగా పేరొందిన మద్దూరి అన్నపూర్ణయ్య 1899 మార్చి 20న తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం తాలూకా కొమరగిరిలో జన్మించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, పాత్రికేయుడు. కాంగ్రెస్, నవశక్తి, జయభారత్, వెలుగు పత్రికలు నడిపిన ఘనత ఆయనది. స్వాతంత్ర్య ఉద్యమకాలంలో అపూర్వ త్యాగాలు చేసి స్వాతంత్ర్యానంతరం జాడ కనిపించకుండా పోయిన మహోన్నత నాయకుడు. 1954 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

కేంద్రమంత్రులతో ఎంబీ పాటిల్ భేటీ

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్‌లో సీఎం రేసులో ఉన్నామంటూ చెప్పుకొనేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ వరుసలో రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఉన్నారు. ఇటీవలే తన అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. తాజాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామితోపాటు పలువురితో భేటీ అయ్యారు. పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించే దిశలో గ్లోబల్ ఇన్వెస్టర్స్‌మీట్ 2025లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ పర్యటిస్తున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి కేంద్రమంత్రి కుమారస్వామితో చర్చించారు. ఇందుకు కేంద్రంనుంచి తమవంతు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఎంబీ పాటిల్ పర్యటనపై ఉన్న గుసగుసలకు తెరపడినట్టయ్యింది.

అనంతరం సింగపూర్ హైకమిషనర్ సైమన్ వాంగ్ వై కుయెన్‌తో భేటీ అయి సెమి కండక్టర్‌లు, డిజిటల్ సాంకేతికత, ఆరోగ్య, వైద్య పరిశోధనలు, విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాలలో భారత, సింగపూర్‌ల మధ్య జరిగిన ఒప్పందాలపై చర్చించారు. అనంతరం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. ఏరోస్పేస్, రక్షణా రంగానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కర్ణాటకలో రక్షణా కారిడార్ స్థాపించే అంశంపై చర్చించినట్టు తెలుస్తోంది. కారవార నౌకా విమానాశ్రయంలో రన్‌వేను 2వేల మీటర్ల నుంచి 2,700 మీటర్లకు పెంచే అంశంపై కేంద్ర మంత్రితో చర్చించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ భేటీ అయ్యారు. ఇలా పలువురు కేంద్ర మంత్రులు, సింగపూర్ హై కమిషనర్‌తో భేటీ అయ్యారు. అనంతరం ఎంబీ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం ఏరోస్పేస్, రక్షనా రంగం ఉత్పత్తులలో, సాంకేతిక రంగం ముందంజలో ఉందని, పలు దశాబ్దాలుగా దేశానికి అమూల్యమైన సేవలందిస్తోందని మరింత పటిష్టం చేసేందుకు వివిధశాఖల మంత్రులతో చర్చలు జరిపామన్నారు.



కేంద్ర మంత్రి కుమారస్వామి, రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్‌తో మంత్రి ఎంబీ పాటిల్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చింతామణి పట్టణంలో ట్రాక్టర్‌పై ఊరేగింపు

పోటాపోటీగా నిమజ్జనం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 10: శిడ్లఘట్ట పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా వినాయక చవితిరోజున కొలువుదీర్చిన గణనాథులను మూడోరోజు సోమవారం సాయంత్రం పలు చోట్ల నిమజ్జనం చేశారు. అంతకుముందు వివిధ సంఘాల ప్రముఖుల నేతృత్వంలో ఊరేగింపు సాగింది. సమాజ సేవకుడు సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తగవులకు అవకాశం లేకుండా హిందు ముస్లింలు సౌహార్ద్రతతో ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మొహరం పండుగలో హిందువులు పాల్గొనగా వినాయక చవితి ఉత్సవం ఊరేగింపులు ముస్లింలు పాల్గొన్నారన్నారు. వీరగాసె, తుమకూరు దప్పు వాయిద్యం తదితర కళాబృందాలు సందడిగా సాగాయి. తాలూకాలోని ఇ.తిమ్మసంద్ర పంచాయతీ హాళే హళ్ళిలో హిందు ముస్లింలు సంబరంగా ఊరేగింపులో పాల్గొని భావైక్యతను చాటారు. కాగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రంగవల్లుల పోటీలు, కోలాటం, మ్యూజికల్ చెయిర్స్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యాగణపతి సేవా సమితి సభ్యులు ఉత్సవాలను పర్యవేక్షించారు.



దేశిహళ్లి వద్ద వినాయకుడి ఊరేగింపు

చింతామణిలో...

చింతామణి: పట్టణంలోని పలు లే అవుట్లలో ప్రతిష్ఠించిన గణనాథులను ఘనంగా ఊరేగించి శివారులోని కన్నంపల్లిలోని ఓటికెరె, మాళపల్లిలోని చెరువులోనూ నిమజ్జనం చేశారు. పురవీధులగుండా ట్రాక్టర్‌లపై వినాయకుల ఊరేగింపు సాగింది. కొన్నిచోట్ల యువత పెద్దసంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. ఓటికెరెలో నిమజ్జనం చేసేందుకు నగరసభ కమిషనర్ జి.ఎన్.చలపతి ప్రత్యేకంగా పౌరకార్మికులను కేటాయించారు.



రంగవల్లుల పోటీలు



శిడ్లఘట్ట తాలూకాలో ఉత్సవంలో యువత

జాతీయస్థాయికి ఎంపిక కావడం గర్వకారణం : ఎమ్మెల్యే



క్రీడాపోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, సెప్టెంబరు 10: మారుమూల గ్రామంలోని పాఠశాలలో చదివిన విద్యార్థి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రాణించి తాలూకా స్థాయి, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి కొనియాడారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో విద్యాశాఖ నిర్వహించిన తాలూకాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల్లో శారీరక శక్తి లేకుండా తరచూ అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని అలాగే క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఉందని ఈసారి 12,500 మంది ఉపాధ్యాయులను నియమించే ప్రస్తావన ప్రభుత్వం ముందు ఉందన్నారు. ఆరు నెలల్లోగా నియామకం జరిగే అవకాశం ఉందన్నారు. తాలూకా విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా తాలూకా స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తాలూకాలోని కళవంచి ప్రభుత్వ పాఠశాలకు చెందిన అన్నప్ప అథ్లెటిక్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై ఎమ్మెల్యే ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, తహసీల్దార్ వెంకటేశ్, బీఈఓ సుకన్య, సమన్వయ అధికారి శశికళ, ఇన్‌స్పెక్టర్ నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 21, 22 తేదీలలో జిల్లా సమ్మేళనం

సీపీఎం నేత మునివెంకటప్ప

బాగేపల్లి, సెప్టెంబరు 10: తాలూకా సమగ్ర అభివృద్ధికోసం నిర్ణయాలు తీసుకునే బాధ్యత మాపై ఉందని ఇదే సందర్భంగా పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రజలలో చైతన్యం పెంచేదిశగా నవంబరు 21, 22 తేదీలలో జిల్లాస్థాయి 18వ సమ్మేళనం జరుగనుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముని వెంకటప్ప తెలిపారు. పట్టణంలోని సుందరయ్యభవనంలో తాలూకా సమితి నేతృత్వంలో మంగళవారం సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి సమ్మేళనం నిర్వహించడం ద్వారా రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్రంగా చర్చ జరుపుతున్నట్టు తెలిపారు. సీపీఎం నేత డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ఎస్ఎల్ఎన్ కల్యాణమండపంలో నవంబరు 21, 22 తేదీలలో సమ్మేళనం ఉంటుందన్నారు. తాలూకా సమితిలో గౌరిబిదనూరు, గుడిబండ, బాగేపల్లి, చింతామణి, శిడ్లఘట్ట తాలూకాల ప్రముఖులతో చర్చలు ఉంటాయన్నారు. సమావేశంలో సీపీఎం ప్రముఖులు రఘురామరెడ్డి, చిన్నగంగప్ప, బిళ్ళూరు నాగరాజు, వాల్మీకి అశ్వథప్ప, జి కృష్ణప్ప, సావిత్రమ్మ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప

సెయింట్‌జాన్స్ ఆసుపత్రి సేవల విస్తరణ

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనకపుర రోడ్డు ప్రాంతంలో సెయింట్‌జాన్స్ ఆసుపత్రి సేవలను విస్తరించింది. బ్రిగేడ్ ఫౌండేషన్, సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజ్ సహకారంతో కనకపుర రోడ్డులోని బ్రిగేడ్ మెడోస్‌లో 108 పడకల ఆసుపత్రిని మంగళవారం లాంఛనంగా ఆరంభించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు, రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రాంతాలవారీగా వైద్యసేవల విస్తారం ద్వారా వేగవంతంగా చికిత్సలు అందుబాటులోకి తెచ్చినట్టు అవుతుందన్నారు. బ్రిగేడ్, సెయింట్‌జాన్స్ సంస్థలు పేరొందినవన్నారు. బ్రిగేడ్ చైర్మన్ ఎంఆర్ జయశంకర్, త్రిచూర్ ఆర్చ్‌బిషప్ మార్ ఆండ్రూస్ థళత్, సెయింట్ జాన్స్ పాలకమండలి చైర్మన్ విక్టర్ హెన్రీ ఠాకూర్, బెంగళూరు ఆర్చ్‌బిషప్ డాక్టర్ పీటర్ మచాడో, ఆంటోనిస్వామితోపాటు పలువురు పాల్గొన్నారు. కార్డియాలజీ, న్యూరో, శ్వాసకోశతోపాటు అన్ని విభాగాలు కలిపి 108 పడకలతో ఆసుపత్రి ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు తదితరులు

నైపుణ్యాభివృద్ధికి సహకారం

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు అవసరమైన నిర్దిష్ట నైపుణ్యత అభివృద్ధి కోసం కాన్స్‌బర్గ్ డిజిటల్ సంస్థ 'నిపుణ' కార్యక్రమం యువతకు సహకారం కానుం దని ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు. కాన్స్‌బర్గ్ డిజిటల్ సంస్థ చైర్మన్ సీఈఓ షేన్‌మేక్ ఆర్డర్, ఇండియా ఎండీ దీపక్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం విధానసౌధలో మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ విభా గాలలో నికరమైన నైపుణ్యత కల్పించదలిచినట్టు షేన్ అభిప్రాయపడ్డారు. ఆవిష్కరణలు, పరిశోధనల విభాగంలో యువతకు సహకారం ఇచ్చే సంస్థలకు తాము సంపూర్ణంగా తోడ్పాటు ఇస్తామన్నారు. ఐటీబీటీ శాఖ కార్యదర్శి ఏకరూప్‌కౌర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



విధానసౌధలో మంత్రి ప్రియాంకఖర్గేతో కాన్స్‌బర్గ్ డిజిటల్ సంస్థ ప్రతినిధులు

నేత్రదానంపై అవగాహన పెరగాలి



వాకథాన్‌లో వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ రజని తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వాకథాన్‌ను వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రజని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో నేత్రదానంపై అవగాహన పెరగాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడం ద్వారా కొన్ని నెలల వ్యవధిలోనే వివిధ కంటిజబ్బులతో బాధపడి చూపు కోల్పోయినవారికి దృష్టి ప్రసాదించవచ్చునన్నారు. బీజేపీ బెంగళూరు నగర జిల్లా అధ్యక్షుడు సప్తగిరిగౌడ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెరగాలంటే విద్యాసంస్థలలో నేత్రదానంపై చర్చలు జరపాలన్నారు. ఆసుపత్రి ప్రాంతీయముఖ్యులు డాక్టర్ రాకేశ్ మాట్లాడుతూ వాకథాన్ ద్వారా నేత్రదానంపై అవగాహన కల్పించదలిచామని అందుకు అరవిందో విద్యాసంస్థతోపాటు పలువురు ముందుకురావడం సంతోషమన్నారు. రాజాజినగర్‌లో జరిగిన వాకథాన్‌కు స్థానికులు సహకరించారు. డాక్టర్ అమర్ అగర్వాల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

టీకాల ఆవశ్యకతపై వినూత్న జాగృతి

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీకాలు వేసుకోవడం ద్వారా కలిగే ప్రయో జనాలపై నగరంలోని విశ్వే శ్వరయ్య టెక్నలాజికల్ మ్యూజియంలో మంగళ వారం ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండే షన్ అధ్యక్షులు డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. ఐసీఎంఆర్‌కు చెందిన నిపుణులతోపాటు పలువురు విచ్చేశారు. విద్యార్థులు ప్రదర్శనను వీక్షించారు. పలు రోగాల నియంత్రణకు ఆదిలోనే నియం త్రించే శక్తి టీకాలకు ఉంటుందని వక్తలు వివ రించారు. ఆయా వయసులకు అనుగుణంగా పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయాలని సూచించారు. మ్యూజియంలో ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు.



ప్రదర్శనలో విద్యార్థులు

ఒరిజిన్ ద్వారా తాజా పండ్లు

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగ దారుడి చెంతకు కోత కోసిన 12 గంటల్లోగానే పంట ఉత్పత్తులను చేర్చదలిచామని ఒరిజిన్ స్టార్టప్ సీఈఓ ప్రశాంత్‌వాసన్ ప్రకటించారు. మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ 250 రకాల పండ్లు, కూరగాయలను కోత కోసిన 12 గంటల్లోనే వినియోగదారుడికి చేర్చదలిచామన్నారు. ఇందుకోసం 5వేలమంది రైతులతో ఒప్పందం చేసుకున్నామన్నారు. దేశంలోనే తొలి తాజా ఉత్పత్తుల బ్రాండ్ కానుందన్నారు. ప్రైజ్ ఆర్ నథింగ్ పేరిట ఏఐ సాంకేతిక విధానంతో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా పంపిణీ చేయదలిచామన్నారు. సాధారణంగా పండ్లు, కూరగాయలు 25శాతానికిపైగా వృథా అవుతాయన్నారు. అందుకే మార్కెట్‌లో తాజా వస్తువులు అందించదలిచామన్నారు. ఆఫ్‌లైన్‌లో నగరంలో 40 స్టాళ్లు తెరవదలిచామన్నారు. ఒరిజిన్ అప్లికేషన్ ద్వారా 20 నిమిషాల్లో చేర్చదలిచామన్నారు.

రాజ్యాంగంతోనే ఎమ్మెల్యే పదవి

పావగడ, సెప్టెంబరు 10: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ రూ పొందించిన రాజ్యాంగంతోనే ఎమ్మెల్యే పదవి దక్కిందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం నిడుగల్ పుర, కన్నమేడి, దొమ్మితిమ్మర్రి గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా జేజేఎం పైప్‌లైన్ పనులు వేగవంతం చేసి ఇంటింటికీ తాగునీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ పంచాయతీ అధ్యక్షులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

తల్లికోసం ఆటో ఎత్తిన బాలిక

సీఎం సహా పలువురు ప్రశంస

బెంగళూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిని కాపాడేందుకు మరొకరికోసం ఎదురుచూడకుండా 13ఏళ్ల బాలిక సాహసోపేతంగా ఆటోను ఎత్తి ప్రాణాలు కాపాడిన సంఘటన సర్వత్రా వైరల్ అవుతోంది. దక్షిణకన్నడ జిల్లా కిన్నిగోళి సమీపంలో తల్లి చేతన రోడ్డు దాటు తుండగా కొంతముందుగా కుమార్తె, ఏడో తరగతి విద్యార్థిని వైభవి నడుచుకుంటూ వెళ్తుంటారు. వేగంగా వచ్చిన ఆటో తల్లిని ఢీ కొని పల్టీ కొట్టింది. అంతలోనే ఆమె కేకలు వేయడంతో ముందు వెళ్తున్న వైభవి పరుగెత్తి వచ్చి ఆటోను పైకి ఎత్తే ప్రయత్నం చేసింది. దీంతో ఆమె కొంతమేర ఊపిరిపీల్చుకున్నారు. అంతలోనే కొందరు పరుగెత్తుకు వచ్చి పక్కకు నెట్టారు. దీంతో చేతన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శుక్రవారం సంఘటన చోటు చేసుకోగా సోమవారం వీడియోలు వైరల్ అయ్యాయి. సీఎం సిద్దరామయ్య సహా పలువురు మంగళవారం ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

బంగారపేట, సెప్టెంబరు 10: పట్టణ రైల్వేస్టేషన్ సమీపానగల కొప్పద చెరువులో గుర్తు తెలియని శవం మంగళవారం లభ్యమైంది. మృతుడికి సుమారు 40ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసులు గస్తీ తిరుగుతున్న వేళ చెరువులో పడిన మృతదేహాన్ని గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.

బస్సు, బొలెరో ఢీ - ఒకరి మృతి

చింతామణి, సెప్టెంబరు 10: ప్రైవేట్ బస్సు, టమోటా తరలిస్తున్న బొలెరో వాహనం ఢీ కొన్న ఘటనలో బొలెరో వాహన డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చింతామణి - చేళూరు రోడ్డు మార్గంలో సిద్దేపల్లి క్రాస్ సమీపాన కనిశెట్టిహళ్ళి వద్ద మంగళవారం ఉదయం సుమారు 7 గంటలకు ప్రమాదం జరిగింది. బొలెరో డ్రైవర్ రెడ్డెప్ప (35) మృతి చెందాడు. ఇతను చేళూరు తాలూకా పాతపాళ్య శివపుర గ్రామ వాసి గా గుర్తించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

1300 క్వింటాళ్ళ విత్తనాలు కేటాయింపు

మడకశిర, సెప్టెంబరు,10: ఖరీఫ్‌లో వర్షాబావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు 1300 క్వింటాళ్ళ ఉలవ విత్తనాలు కేటాయించినారని వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వీలుగా 80శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలు అందజేస్తామన్నారు. మడకశిర మండలానికి 300 క్వింటాళ్ళు, అమరాపురం మండలానికి 400 కింటాళ్ళు, గుడిబండ మండలానికి 300 క్వింటాళ్ళు, రొళ్ళ మండలానికి 90 క్వింటాళ్లు అగళి మండాలనికి 210 క్వింటాళ్ళ ఉలవ విత్తనాల ను కేటాయించారన్నారు. 10కేజీల ఉలవ విత్తనాల పాకెట్ పూర్తి ధర రూ. 870 అందులో 80శాతం సబ్సీడి రూ.696లు పోను రైతు రూ.174 చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెల 13 నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.